ప్రజాశక్తి





గురువారం 4 జులై 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

అక్కరకు వచ్చేనా..?





ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం యువత ఎదురుచూపు

మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామిక వాడల్లో మంత్రి పర్యటన

అశోక్ లేలాండ్ ఉత్పత్తులు ప్రారంభిస్తుందని సంకేతాలు

బందరులో రిఫైనరీ నిర్మాణం చేయాలని పార్లమెంట్‌లో ఎంపి చర్చ

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లాలో పారిశ్రామిక ప్రగతి నామమాత్రంగానే ఉండటంతో రానురాను ఉపాధి, ఉద్యోగావకాశాలు కుదించుకుపోతున్నాయి. జిల్లాలోని గన్నవరం నియోజకవర్గంలో భారీగా భూములు సేకరించి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజులకే గన్నవరం ప్రాంతంలోని మోడల్ పారిశ్రామిక పార్కులో పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ పర్యటించి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పడం, బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి బందరులో నిర్మిస్తున్న ఓడరేవుకు అనుబంధంగా ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయాలని పార్లమెంట్‌లో చర్చను లేవనెత్తడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ నేతల మాటలు ఆచరణలో ఎంత వరకు అక్కరకు వస్తాయనేది వేచి చూడాల్సి ఉంది.

ఇండస్ట్రియల్ పార్కు అత్యధికం ఖాళీనే !

బాపులపాడు మండలం మల్లవల్లిలో 1200 ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ (ఎపిఐఐసి) 2016లో మోడల్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసింది. దీనిలోనే మరో వంద ఎకరాల్లో ఫుడ్ పార్కు లేఅవుట్ వేసింది. కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.80 కోట్లతో 2017లో ప్రారంభమైన సెంట్రల్ ప్రాసెసింగ్ (సిపిసి) ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఈ పారిశ్రామిక ప్రాంతంలో అశోక్ లేలాండ్, మోహన్ స్పిన్‌టెక్, హెరిటేజ్ సంస్థలతో పాటు, ఫుడ్ పార్కులో మరికొన్ని సంస్థలు పారిశ్రామిక యూనిట్లను స్థాపించాయి. అయితే అత్యధిక విస్తీర్ణంలో భూములు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

మళ్లీ అశోక్ లేలాండ్ యూనిట్ !

మల్లవల్లిలో మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో బస్సు బాడీ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఎకరం రూ.16.50 లక్షలు చొప్పున 75 ఎకరాలను అశోక్ లేలాండ్ సంస్థకు కేటాయించింది. 2018 మార్చి 31న ముఖ్యమంత్రి చంద్రబాబు బాడీబిల్డింగ్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పరిశ్రమ ఏర్పాటు చేసి కేవలం 180 రోజుల్లో బస్సు ఛాయిస్‌లపై బాడీల తయారీ ప్రక్రియ చేపడతామని సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తొలుత రూ.90 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 2,400 బస్సు ఛాయిస్‌ల నిర్మాణానికి అవసరమైన యూనిట్ ఏర్పాటు చేసి 1065 మందికి ఉపాధి కల్పిస్తామని సంస్థ తెలిపింది. పరిశ్రమ ఏర్పాటు పూర్తి కావచ్చిందని చెప్పి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించే పేరుతో 2019 సార్వత్రిక ఎన్నికలకు (మిగతా 2లో)

అతిసార కట్టడికి చర్యలు తీసుకోవాలి

- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం
- కలెక్టర్ సృజనకు సిపిఎం నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లాలో అతిసార నివారణకు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జి.సృజనకు బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివి కృష్ణ మాట్లాడుతూ విజయవాడ నగరంతో పాటు జిల్లాలో శుద్ధి చేసిన పరిశుభ్రమైన మంచినీటిని కుళాయిల ద్వారా ఉచితంగా సరఫరా చేయాలన్నారు. వ్యాధి తీవ్రత దృష్ట్యా ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స పొంది లక్షలాది రూపాయలు అప్పుల పాలైన వారికి సిఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులను విడుదల చేయాలని కోరారు. పేదలే ఎక్కువుగా వ్యాధి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేయాలని కోరారు. మృతులు, వ్యాధి బారిన పడిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు. జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో అతిసార వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం బృందం గత నెల 28వ తేదీన పర్యటించిందన్నారు. వత్సవాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్‌పేట హెల్త్ సెంటర్, జగ్గయ్యపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను పరిశీలించి పలు అంశాలను వెలికితీయడం జరిగిందన్నారు. వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఇళ్ల వద్ద, ఆయా కేంద్రాల్లో చికిత్స పొందుతున్న వ్యాధి బాధితులను పరామర్శించడం జరిగిందన్నారు. జగ్గయ్యపేటలో వ్యాధితో మృతి చెందిన రంగయ్య కుటుంబ సభ్యులను బృందం పరామర్శించి ధైర్యం చెప్పిందన్నారు. వత్సవాయి మండలంలో నీటి సరఫరా తీరును, షేర్ మహమ్మద్ పేటలో తాగునీటి సరఫరా కేంద్రానికి వెళ్లి పరిశీలించిందన్నారు. తాగునీటి పథకాల వద్ద పరిశుభ్రత లేకపోవడం, మంచినీటి ట్యాంక్‌లు, పైప్‌లైన్లు లీకులు, మరమ్మతులు చేయకపోవడం వల్ల తాగునీరు కలుషితమై అతిసార వ్యాధి ప్రబలినట్లు సిపిఎం బృందం పర్యటనలో తేలిందన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని 16వ వార్డులు, (మిగతా 2లో)



సమావేశంలో మాట్లాడుతున్న కాశీనాథ్

కార్మిక చట్టాలు అమలయ్యేలా చూడండి

మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేత కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ మునిసిపల్ కార్మికులు పుట్టెడు కష్టాలు భరిస్తూ, బండెడు చాకిరీ చేస్తూ అర్ధాకలితో జీవితాలు వెళ్లదీస్తున్నా ఈ ప్రభుత్వాలకు పట్టడంలేదని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సఫాయి కర్మచారీస్ జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి వ.వ. అధ్యక్షతన జాతీయ కమిషన్ సఫాయి కర్మచారీస్ మినిస్టరీ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో బుధవారం సఫాయి కర్మచారీస్ కార్మికుల సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో మునిసిపల్ కార్మికులు అత్యంత దయనీయ, దుర్భరమైన పరిస్థితుల్లో పని చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సఫాయి కర్మచారీస్ కమిషన్ నియమ నిబంధనలు, కార్మిక సంఘాల సూచనలు, సలహాలను విఎంసి అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. మనుషులతో చేయించకూడని, యంత్రాలు పెట్టి చేయించే పనులను సైతం మునిసిపల్ కార్మికులతో చేయిస్తూ చట్టాలను విఎంసి అధికారులు ఉల్లఘిస్తున్నారని, వీటన్నింటిపై (మిగతా 2లో)

పారిశ్రామికవాడల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి భరత్
- గన్నవరం నియోజకవర్గంలో పర్యటన

ప్రజాశక్తి-గన్నవరం: రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తుందని, మల్లవల్లి, వీరపనేనిగూడెంలను అతిపెద్ద పారిశ్రామికవాడలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని మల్లవల్లి పారిశ్రామికవాడ, గన్నవరం మండలం వీరపనేనిగూడెంలోని బస్సు బాడీ బిల్డింగ్ కంపెనీలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు పారిశ్రామిక వాడల్లో విద్యుత్ కోతల వల్ల ఆయా పరిశ్రమల్లో ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందని, తద్వారా నష్టం వాటిల్లుతుందని పారిశ్రామికవేత్తలు మంత్రికి వివరించారు. వెంటనే మంత్రి విద్యుత్ అధికారులను పిలిచి సమస్య కారణాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ స్టేషన్లో సిబ్బంది కొరత సమస్య పరిష్కరించాలని, విద్యుత్తు నిర్వహణ పక్కాగా నిర్వహించి కోతలు లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సమస్య పునరావృతం కారాదని హెచ్చరించారు. అశోక్ లేలాండ్ వంటి పెద్ద పారిశ్రామిక బ్రాండెడ్ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. మల్లవల్లి, వీరపనేని గూడెం పారిశ్రామికవాడల గుర్తింపునకు ప్రవేశ ద్వారాలను నిర్మించాలని, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పారిశ్రామిక వాడల చుట్టూ కంచె, ప్రహరీ నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఏర్పాటు చేయాలని, గ్రీన్ జోన్ ఏర్పాటు చేసి గ్రీనరీ అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా భూమి ధరలు ఉంటే కంపెనీలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారని తెలిపారు. పరిశ్రమలు రావడం వల్ల యువతకు, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామికవాడను రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లో భూ సమస్యలు, కనీస వసతుల కల్పన, తదితర అంశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్‌డిఒ పి.పద్మావతి, ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేక్, జోనల్ మేనేజర్ సీతారాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు, ఎపిఐఐసి, పరిశ్రమల శాఖ, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.



మల్లవల్లిలోని టెక్స్‌టైల్ కంపెనీని పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

మొదటిపేజీ తరువాయి

అక్కరకు వచ్చేనా..?

ముందే గన్నవరంలో జాబ్‌మేళా నిర్వహించింది. ఆ తర్వాత బాడీ బిల్డింగ్ యూనిట్‌లో ఉత్పత్తిని మాత్రం ప్రారంభించలేదు. మంత్రి టి.జి. భరత్ ఈ పారిశ్రామిక పార్కులో పర్యటించే సందర్భంలో అశోక్ లేలాండ్ సంస్థ త్వరలో ఇక్కడ ఉత్పత్తులు చేపడుతుందని, ఇక్కడ మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పడం ఆసక్తి కలిగిస్తోంది.

బందరులో రిఫైనరీపై పార్లమెంట్‌లో చర్చ

బందరు పార్లమెంట్ పరిధిలోని దివిసీమ గుల్లలమోద ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం మిస్సైల్ లాంచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుందని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం దీని నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేసింది. అయితే గత కొన్నేళ్లుగా దీని ఊసే ఎక్కడా వినపడటం లేదు. ఈ క్రమంలోనే తాజాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లేకుంటే భారత్ పెట్రోలియం సంస్థగానీ బందరులో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయడానికి కేంద్రం సహకరించాలని బందరు ఎంపి బాలశౌరి పార్లమెంట్‌లో కోరారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఆయిల్ రిఫైనరీ నిర్మాణానికి ఏ మేరకు సహకరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

అతిసార కట్టడికి చర్యలు తీసుకోవాలి

జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని 17 గ్రామాల్లో 300 మందికి పైగా వ్యాధి బారిన పడ్డారని, ఆరుగురు మృత్యువాతపడ్డారని అన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. విజయవాడలోని మొగల్రాజపురం, కండ్రిక తదితర ప్రాంతాల్లో డయేరియా ప్రబలి పది మంది వరకు మృత్యువాతపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు మంద మందికి పైగా వ్యాధి బారిన పడ్డారని గుర్తు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోడంతో స్థానిక సంస్థల్లో (పంచాయతీలు) పైప్‌లైన్ల మరమ్మతులు, మంచినీటి ట్యాంక్‌లు, బావుల నిర్వహణ చేయలేనిపరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే జగ్గయ్యపేట మునిసిపాలిటీకి రూ.5 కోట్లు, మేజర్ పంచాయతీలకు రూ.25 లక్షలు, మైనర్ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరారు. పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులను భర్తీ చేయాలని, వారి వేతనాలను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, దోనేపూడి కాశీనాథ్ ఉన్నారు.

కార్మిక చట్టాలు అమలయ్యేలా చూడండి

సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస కూలి, పని భారం తగ్గించడం, ఆదివారం సెలవుల మంజూరు ఏ ఒక్కటీ కూడా అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో అనేక ప్రమాదాల్లో కార్మికుల జీవితాలు గాలిలో కలుస్తున్నా...వారి కుటుంబాలు వీధుల పాలవుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. సఫాయి కర్మచారీస్ కమిషన్ సభ్యులు ఏడాదికో..రెండేళ్లకో వచ్చి ఇటువంటి సభలు, సమావేశాలు నిర్వహించి, కార్మిక సంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించడమే తప్ప సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అనేక పోరాటాలు, ఉద్యమాలు, వినతిపత్రాల రూపంలో నగరపాలక సంస్థ అధికారులను వినతిపత్రాలు అందజేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ (ఆప్కాస్) కార్మికులు 4 వేల మందికిపైగా పని చేస్తున్నారని తెలిపారు. ఏడాదికేడాదికి మునిసిపల్ పర్మినెంట్ పారిశుధ్య కార్మికుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. కార్మికులు ప్రమాదాలు చోటుచేసుకొని పని ప్రదేశాల్లో మృత్యువాత పడినా వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలను ఇవ్వడం లేదన్నారు. ఇటువంటి ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి ప్రవీణ్, వెహికల్ డిపో బాధ్యులు శీను, డ్రైనేజీ సెక్షన్ బాధ్యులు బత్తుల బ్రహ్మయ్య, జై రావు, నగర ఉపాధ్యక్షురాలు, టి.తిరుపతమ్మ, పార్కు సెక్షన్ బాధ్యులు టి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



ప్రజాశక్తి-విజయవాడ: రక్షిత తాగునీరు, పారిశుధ్యంతో ప్రజల ఆరోగ్య రక్షణ తద్వారా జీవన ప్రమాణాల మెరుగుకు దోహదం చేస్తాయని... దీన్ని దృష్టిలో ఉంచుకొని రక్షిత, సమగ్ర రక్షిత మంచినీటి పథకాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సజన.. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్, రహదారులు, భవనాలుబీ ప్రజారోగ్యం, ఏపీఈడబ్ల్యూఐడీసీ సూపరింటెండింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాల పరిధిలో మంజూరైన పనులు, చేపట్టిన పనులు, వాటిలో పురోగతి తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు.. 7,917 చేతిపంపులతో పాటు 868 రక్షిత మంచినీటి పథకాలు, డైరెక్ట్ పంపింగ్, 19 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు ఉన్నట్లు వివరించారు. అదే విధంగా రక్షిత, సమగ్ర రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, ఆర్‌వో ప్లాంట్ల స్థితిగతులు, తాగునీరు చెరువుల పరిస్థితి, వివిధ పథకాల ద్వారా పురోగతిలో ఉన్న పనులు, జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనుల పురోగతి తదితరాలకు సంబంధించిన అంశాలను వివరించారు. ఇదే విధంగా మిగిలిన ఇంజనీరింగ్ విభాగాల అధికారులు తమ పరిధిలోని మానవ వనరులు, కార్యకలాపాలు తదితరాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ తాగునీరు ఎట్టిపరిస్థితుల్లోనూ కలుషితం కాకుండా అప్రమత్తతతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పైపులైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలని.. క్షేత్రస్థాయి అధికారులతో సరైన సమన్వయంతో తాగునీటి సరఫరా వ్యవస్థల రక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. తాగునీటి నమూనాలను పరీక్షించేందుకు విజయవాడలోని డిస్ట్రిక్ట్ ల్యాబ్‌తో పాటు నందిగామ సబ్ డివిజన్ ల్యాబ్ ఉన్నందున.. వీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు బ్యాక్టీరియలాజికల్ కెమికల్ టెస్ట్‌లు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ ఎ.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ డీవీ రమణ, ఇరిగేషన్ ఎస్‌ఈ ప్రసాద్‌బాబు, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ వీకే విజయశ్రీ, ప్రజారోగ్యం ఈఈ డి.భూషణం, ఏపీఈడబ్ల్యూఐడీసీ బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంపై సమీక్ష

జిల్లా పారిశ్రామిక రంగంపైనా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వాటి పురోగతిపై చర్చించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఈజీపీ క్రెడిట్ లింక్డ్ రాయితీ పథకంపై సరైన విధంగా అవగాహన కల్పించి.. అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో తాము ఉపాధి పొందడంతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించేలా యువతను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈల అభివృద్ధి, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు, తనిఖీల నిర్వహణ, విపత్తు నిర్వహణకు సంబంధించి మాక్‌డ్రిల్స్ నిర్వహణ తదితరాలపై కలెక్టర్ సజన సూచనలిచ్చారు. సమావేశంలో జీఎం డీఐసీ ఎ.సుధాకర్, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడండి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్



ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు ప్రవేశాలు, బోధనా సిబ్బంది, మౌలిక వసతులు, పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు హాజరయ్యేలా చూసి.. నిర్దేశ బోధనా ప్రణాళికకు అనుగుణంగా విద్యా నైపుణ్యాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా హాజరుకాకుంటే అందుకు గల కారణాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కరిక్యులర్, కోకరిక్యులర్ యాక్టివిటీస్‌ను అమలు చేయాలన్నారు. ప్రతి విద్యార్థిపైనా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. తరచు పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, డిస్ట్రిక్ట్ వొకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, ఆర్ఐవో పి.రవికుమార్ పాల్గొన్నారు.

వికలాంగులు రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ ఆర్థిక సంవత్సరమునకుగాను కృష్ణా జిల్లాలో ఉన్న వికలాంగులు రుణాలు మంజూరు కొరకు దరఖాస్తులు చేసుకుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయో వద్ధుల సహాయ సంస్థ అధికారి వి.కామ రాజు తెలిపారు. జాతీయ దివ్యాంగుల ఆర్థిక మరియు అభివద్ధి సంస్థ (ఎన్ హెచ్ ఎఫ్ డి సి) న్యూడిల్లీ వారు వికలాంగుల రుణాల కోసం 2024-2025 సంవత్సరానికి గాను ఆంధ్ర ప్రదేశ్‌కు 9.15 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. కావున కష్ణాజిల్లా లోని ఆసక్తి గల వికలాంగులు 40 శాతం, ఆ పైన అంగవైకల్యము కలిగి 18 నుండి 60 సంవత్సరములు కలవారు (ఎంఆర్ అయితే 14 సంవత్సరాలు) రుణాలు పొందడానికి అర్హులన్నారు. మంజూరు అయిన రుణం మొత్తం తిరిగి పూర్తిగా వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందన్నారు . ఎటువంటి సబ్సిడి ఉండదన్నారు. ఇతర వివరాల కోసం కార్యాలయపు పని వేళలలో సంప్రందించాలన్నారు. ఇతర వివరముల కొరకు ఈ కార్యాలయపు ఫోన్ నెం. 08672- 252637 కు సంప్రదించాలన్నారు.

వంశపారంపర్య ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అర్చకులకు వంశపారంపర్య ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని అర్చక సమైక్య రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ టి అనంతచార్యులు కోరారు. బుధవారం అవని గడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్చకుల నుంచి వంశపారంపర్య హక్కులకు సంబంధించిన ఆహార పత్రాలు 10 ద్వారా సమర్పించిన ఇప్పటివరకు హక్కు పత్రాలు జారీ చేయకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక సస్పెన్షన్కు గురైన సహాయ కమిషనర్ శాంతి ధవీకరణ పత్రా లు తీసుకోవాలని అర్చకులకు సమాచారం ఇచ్చి వెంటనే పత్రాల జారీని వాయిదా వేయటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేవలం అర్చకులను వేధించడమే ఆమె ధ్యేయంగా పెట్టుకున్నట్లు ఉందన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన సహాయ కమిషనర్ వంశపారంపర్య హక్కు పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారిని శాంతిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల జీవితాలు ఒక అర్చక సమైక్య సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అర్చకులు పాల్గొన్నారు.

కాగిత కృష్ణప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో సెయింట్ జాన్స్ హైస్కూల్ యాజమాన్యం స్కూల్ పూర్వ విద్యార్థి అయిన పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్‌ని ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించినందున ఎమ్మెల్యేను సన్మానించి అభినందనలు తెలియజేశారు. హైస్కూల్ డైరెక్టర్ సాబుజాన్ ఝాన్సీ సాబ్, కష్ణ ప్రసాద్ స్నేహితులు కే రంజిత్, ఆనందరావు, నున్న రాంబాబు, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తరించాలి : ప్రసాద్



ప్రజాశక్తి-గన్నవరం : రోటరీ సామాజిక సేవలు మరింత విస్తరించాలని రోటరీ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ ఎం వి ప్రసాద్ అన్నారు. బుధవారం కొత్తపేట రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షులుగా టి ఎస్ ఆర్ కే ప్రసాద్, కార్యదర్శిగా జీవి రవి, మరి కొంతమందితో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రసాద్ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలో రొటేరియన్లు చేస్తున్న కషి మరింత పెరగాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు విద్య, వైద్య సేవలను చేరువ చేయాలన్నారు. నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ శ్రీ హర్ష, రోటేరియన్లు జాస్తి విజయ భూషణ్ కుమార్, నర్రా సీతారామారావు, చింతపల్లి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు : అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం పురస్కరించుకుని ఏజిఆండ్ఎస్ఎస్ కళాశాల జంతు, వక్షశాస్త్రం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వ్లల అనర్థాలపై విద్యార్థులకు వక్తత్వ పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కాలుష్యం త గ్గించానికి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించకుండా ప్రజలకు అవగాహన కలిగించ డానికి ఉపయోగపడే పోస్టర్ ప్రజంటేషన్ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టికి వినియోగిం చడంవల్ల సంవత్సరాల పాటు మట్టిలో కలసిపోకుండా ఉంటుందని, తద్వారా కలిగే హానిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ విద్యార్థులకు సూచించారు. ఈసందర్భంగా వక్తత్వ పోటీల్లో విజేలకు శివనాథ్ సర్టిపికెట్లు అందజేశారు. కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ శివారు సీతా యలంక గ్రామంలో డ్రైనేజీ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి కోటగిరి లంక అంతా రోడ్లపై డ్రైనేజీ నీరు నిల్వ ఉండ టంతో ఆ ప్రాంతానికి వేరే కార్యక్రమానికి వెళ్లిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రోడ్లపై డ్రైనేజీ నీటిని చూసి పంచాయతీ అధికారులతో మాట్లాడారు. తక్షణమే డ్రైనేజీ నీటిని తొలగించి ఆ ప్రాంతంలో డ్రైనేజీ ప్రక్షాళన చేయాలని ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు పారిశుధ్య సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి డ్రైనేజీ ప్రక్షాళన పనులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా కచ్చా డ్రైనేజీల్లో పూడిక తీత పిచ్చి మొక్కల తొలగింపు డ్రైనేజీలో మురుగుదల నీటిపారుదలకు అడ్డంకులు తొలగించే పనులు చేపట్టారు. ఈ పనులను టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు ప్రముఖ న్యాయవాది కర్ర సుధాకర్ కంచర్ల ఆనంద్ పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సెప్టెంబర్ 5 న జరిగే ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని జాతీయ స్థాయి అవార్డు కొరకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెర సుల్తానా తెలిపారు. జిల్లాలోని అందరు ఉప విద్యా శాఖాధి కారులకు, మండల విద్యా శాఖాధికారులకు జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు సంబంధించి విధివిధానాలు పంపించామన్నారు. కావున ఉప విద్యా శాఖాధికారులు, మండల విద్యా శాఖాధికారులు మీ పరిధిలోని ఉపాధ్యాయులకు సంబందించిన దరఖా స్తులను సంచాలకులు, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్, అమరావతి వారు జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం పరిశీలించి తగు సిఫారసులతో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం దరకాస్తులను online website http://nationalawardstoteacher.education.gov.in నందు తగు సిఫారసులతో దరఖాస్తు చేయించాలని తెలిపారు. సంబంధిత తనిఖీ అధికారుల సిఫారసు లేని దరఖాస్తులు స్వీకరిం చబడవన్నారు. మెయిల్ ద్వారా వచ్చిన దరఖాస్తులు అంగీకరించబడవని, మాన్యువల్ గా ఇచ్చిన దరఖాస్తులు కూడా స్వీకరించ బడవని తెలిపారు. కావున ఆశక్తి మరియు అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు వారి దరఖాస్తులను సంబందిత తనిఖీ అధికారుల ద్వారా వెబ్‌సైట్‌లో జులై 15 లోగా దరఖాస్తు చేయాలని కోరారు.

భార్య చేతిలో భర్త హతం


మృతుడు అప్పారావు

ప్రజాశక్తి-బంటుమిల్లి : భార్యభర్తలు ఘర్షణ పడగా క్షణికావేశంలో భర్తను భార్య స్క్రూడ్రైవర్‌తో పొడిచి చంపిన ఘటన బంటుమిల్లి మండ లంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం బంటుమిల్లి మండలం, చిన్నతుమ్మడి గ్రామంలో గుసిమి అప్పారావు (30) కీర్తనలకు తొమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 6 సంవత్సరాల బాబు వున్నాడు. మంగళవారం రాత్రి సమయంలో భార్యాభర్తల మధ్య వివాదం ఏర్పడగా అప్పారావును భార్య క్షణికావేశంతో స్క్రూ డ్రైవర్‌తో కంఠంపై పొడవగా అప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. మతుడి అక్క తెర్లాపు అచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాధు మేరకు బంటుమిల్లి ఎస్ఐ వాసు కేసు నమోదు చేవారు. పెడన సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.



లారీ బోల్తా

ప్రజాశక్తి-చల్లపల్లి : బైక్‌ను తప్పించబోయి ఉప్పు లారీ బోల్తా కొట్టిన సంఘటన చల్లపల్లి మండలం లక్ష్మి పురం వద్ద జాతీయ రహ దారిపై బుధవారం జరిగింది. మంగళాపురం నుండి హైవే మీదికి అతి వేగంతో ద్విచక్ర వాహనం రావటంతో గమనించిన లారీ డ్రైవర్ వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో లారీకి బ్రేక్ వేయగా అదుపుతప్పి పల్టీ కొట్టి పంటబోదెలోకి దూసుకెళ్లింది. లారీ వెనుక భాగాన్ని ఢీ కొట్టిన ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారు బందరు మండలం కోన గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

సమాజ సేవ వైపు అడుగులు వేయాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసరావు ఇకపై సమాజ సేవ వైపు అడుగులు వేయాలని జిల్లా పరిషత్ ఇన్చార్జి సిఈఓ సి.ఆనంద్ కుమార్ అన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పంచాయతీరాజ్, మచిలీపట్నం వారి కార్యాలయంలో సూపరింటెండెంట్ విధులు నిర్వహించి జూన్ 30 న ఉద్యోగ విరమణ పొందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు పదవీ విరమణ మహోత్సవ సభ బుధవారం ఎపి పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ జిల్లా పరిషత్ యూనిట్ మచిలీపట్నం వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషద్ మీటింగ్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ హేమ ప్రకాష్, అసోసి యేట్ ప్రెసిడెంట్ పటమట భాస్కర్, బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఇన్చార్జి సిఈఓ సి.ఆనంద్ కుమార్

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వ హించారు. తోట్లవల్లూరు మండల శాఖ మండలంలోని పాఠశాలలలో సభ్యత్వ క్యాపేయేన్, స్వర్ణోత్సవాల ఫండ్ కట్టించారు. ఈ క్యాపేయేన్ లో జిల్లా కార్యదర్శి అబ్దుల్ హబీబ్, ప్రధాన కార్యదర్శి ఎం . విజయశ్రీ, అధ్యక్షురాలు సిహెచ్. మైదిలి, సహధ్యక్షురాలు బి . హిమకుమారి, గౌరవ అధ్యక్షులు ఎ.విష్ణువర్ధన్, మహిళా కార్యదర్శి పి.అనూష పాల్గొన్నారు.


సభ్యత్వం నమోదు చేస్తున్న దృశ్యం

సాయం అందజేత



ప్రజాశక్తి-గన్నవరం : కుప్పాల రాఘవులు కుమారుడు వీరభద్రం ఇటీవల మరణించగా ఆయన పిల్లల కోసం దావాజిగూడెం స్కూల్లో అతనితో పాటు చదువు కున్న అతని ఫ్రెండ్స్ అందరూ కలిసి రూ.53,500 రూపాయలు వసూలు చేశారు. రూ.50 వేలు ఆడపిల్ల పేరున పోస్ట్ ఆఫీస్ లో ఫిక్సడ్ చేశారు. మిగిలిన రూ.3500 సీఐటీయూ నాయ కులు మరియదాసు ద్వారా వీరభద్రం కుటుంబానికి చ్చి పిల్లలకు స్కూల్ పుస్తకాలు కొనమని చెప్పారు. ఎప్పుడో 20 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న వాళ్ళు చూపిన చొరవ నేటి సమాజానికి ఆదర్శం కావాలని పలువురు కొనియాడారు.



దుర్గమ్మ ఆలయానికి రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి గణేష్ నగర్ కాలనీ, విజయవాడకు చెందిన వై.శ్రీనివాసరావు తండ్రి వై.రామలింగారావు, కుటుంబ సభ్యులు యాంద్రాతి దర్శన్ పేరు మీదుగా రూ.5 లక్షలను అమ్మవారి ఆలయ స్వర్ణ తాపడం పనులకు, రూ.1,01,116 లను ఆలయంలో జరుగు శాశ్వత అన్నదానానికి, రూ.21,000 లను దేవస్థానంలో నిర్వహించే ఉచిత అన్నదాన పథకం నిమిత్తం ఒకరోజు 500 మందికి అన్నధానం జరిపేందుకు విరాళంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావుని బుధవారం కలిసి చెక్కు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దాత ఇంటికి వెళ్లి విరాళం స్వీకరణ

విజయవాడ కామకోటినగర్‌కు చెందిన వృద్ధురాలు అనసూయమ్మ భర్త వెంకటేశ్వర్లు తాను చాలా రోజుల నుండి దాచుకున్న డబ్బులు అమ్మవారికి ఇవ్వదలిచి, దేవస్థానానికి రాలేని స్థితిలో ఉండి, విరాళాన్ని స్వీకరించాలని దేవస్థానం వారికి కుటుంబసభ్యుల ద్వారా ఫోన్‌లో సమాచారమందించింది. విషయం తెలుసుకున్న ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు తానే స్వయంగా వారి ఇంటికి వెళ్లి, దాతతో కొద్ది సేపు మాట్లాడి, విరాళాన్ని స్వీకరించారు. వీరికి వేదపండితుల వేదాశీర్వచనం కల్పించి, అమ్మవారి ప్రసాదం, చీర, చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా దాత అనసూయమ్మ రూ.3 లక్షల దేవస్థానానికి అందజేశారు. అందులో రూ.1.50 లక్షలు దేవస్థానంలో నిత్యాన్నదానానికి రూ.1,50 లక్షలు ఆలయ స్వర్ణతాపడం పనులకు గానూ వినియోగించవలసిందిగా ఇఒ కె.ఎస్.రామారావును కోరారు.

నాణ్యమైన విద్యనందించాలి

ప్రజాశక్తి - నందిగామ : కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పేద విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు అధిరోహిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. బుధవారం నందిగామ ఒసి క్లబ్‌లో జరిగిన నందిగామ, తిరువూరు డివిజన్ స్థాయి అన్ ఎయిడెడ్ ప్రైవేట్ యాజమాన్యముల ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కొత్త ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ఫలితాలు సాధించాలని సూచించారు. త్వరలో మరోసారి విద్యాశాఖ అధికారులు, పాఠశాలల కరెస్పాండెంట్లతో కలిసి కూలంకషంగా సమీక్షిస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ తిరువూరు డివిజన్లకు సంబంధించిన ఎంఇఒలు, పాఠశాలల కరెస్పాండెంట్లు పాల్గొన్నారు.

దేవస్థానంలో లైసెన్సులకు వేలంపాట

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

వేదాద్రి శ్రీ స్వామి వారి కౌలు భూములకు బహిరంగ వేలం, తలనీలాలు పోగుచేసుకొనే లైసెన్సుకు టెండర్లకు 4వ సారి బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి చెందిన మండలంలోని వేదాద్రి, రావిరాల, బండిపాలెం గ్రామంలోని కౌలు భూములు '5' బిట్లు సర్వే నెంబర్‌లు 100, 11-1, 150, 207-1, 83 లో య. 2.00 సెంట్లు య.2.00 సెంట్లుబీ య.5.00 సెంట్లు, య.3.50 సెంట్లుబీ య.3.50 సెంట్లుకి, పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, గింజుపల్లి గ్రామంలోని '2' బిట్లుకు సర్వే నెం.లు 87-3, 73 లో య.3.08 సెంట్లు, య.7.86 సెంట్లకు 4వ సారి సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం పాట నిర్వహించారు. దేవస్థాన కేశఖండనశాలలో తలనీలాలు పోగుచేసుకొనే లైసెన్సుకు 2024-25 సంవత్సరం 6న దేవస్థాన కార్యాలయంలో సదరు దేవస్థాన వంశపారం పర్యధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు అధ్వర్యంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సీల్డ్ టెండరు - కం - బహిరంగ వేలంపాట, ఇ-టెండరు నిర్వహించబడుతుందని దేవస్థాన కార్యనిర్వహణా ధికారిణి శిరపరపు హేమలతదేవి తెలిపారు.

విద్యుత్ అంతరాయం నివారించాలని వినతి

ప్రజాశక్తి - భవానీపురం :

విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న సివిఆర్ పై ఓవర్ బ్రిడ్జీ పక్కనున్న శివశక్తి నగర్ వాసులు బుధవారం రామరాజ్యనగర్ విద్యుత్తు శాఖ ఎఇ రామలింగేశ్వరరావుకు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలిగించాలని వినతిపత్రం అందజేశారు. నగరంలో, రూరల్ ప్రాంతాల్లో ఎక్కడా లేని విధంగా విద్యుత్తు సరఫరా అంతరాయం ఈ ప్రాంతాల్లో మాత్రమే ఎక్కువగా ఉందని, కాస్త వేగంగా గాలి వీచినా, వర్షం పడినా శివశక్తినగర్ ప్రాంతంలో ఉన్న సాయి అమరావతి హైట్స్, అస్త్ర అపార్ట్‌మెంట్, విఘ్నేష్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్తు సరఫరాకి అంతరాయం కలుగుతోందని తెలిపారు. విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులు వల్ల టీవీలు, మిక్సీలు, బల్బులు కాలిపోతున్నాయి. పైగా వర్షాకాలంలో ఎదురయ్యే దోమకాటు, ఈగలు మోత వెరసి ఆ ప్రాంతంలో జీవనం నరకప్రాయంగా మారింది. విద్యుత్తు సరఫరా విషయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ ప్రాంత అపార్ట్మెంట్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు తమ ఇబ్బందులు వివరిస్తూ ఏఈకి ఇచ్చిన వినతిపత్రం అందించారు. సమస్య తీవ్రతను



రామరాజ్యనగర్ ఏఇ రామలింగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న శివశక్తి నగర్ వాసులు

అర్థం చేసుకొన్న ఏఈ రామలిగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. ఉన్నత అధికారులతో మాట్లాడి సకాలంలో సమస్యలు పరిష్కరిస్తాననికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయి అమరావతి హైట్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కే వెంకట్రావు, విఘ్నేష్ హైట్స్ అపార్ట్మెంట్ అసోసియేషన్ కార్యదర్శి జమ్ము శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మునేరు, ఆనకట్ట గండ్లను పూడ్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - వత్సవాయి :

పోలంపల్లి మునేరు ఆనకట్ట గండ్లను వెంటనే పోర్చాలని సిపిఎం డిమాండ్ చేసింది. మండలంలోని పోలంపల్లిలో జూనియర్ డ్యామ్ దగ్గర గండ్లను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, రైతు సంఘం నాయకులు తమ్మినేని రాంబాబు మాట్లాడుతూ చెక్ డాం దగ్గర పడిన గండ్లను వెంటనే పూడ్చాలని రైతులకు నారుమడులకు సాగినీరందించాలని డిమాండ్ చేశారు. ఈ ఆయకట్టు కింద వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండల పరిధిలో కొన్ని గ్రామాలకు సాగునీరు అందిస్తున్నారు. అంతేకాకుండా పాతికవేలు ఎకరాలకు పైగా వరి, మిర్చి, మొక్కజొన్న, పత్తి, తదితర పంటలను సాగు చేస్తున్నారు. సంవత్సరం కురిసిన వర్షాలకు పెదమండవ వైపు నాలుగు చోట్ల గండ్లు పడి నీరు వృథాగా పోతుంది. దీంతో రైతులు నారుమడులకైనా నీళ్ల వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంతో రైతులకు ఈ



గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మునేరి డ్యామ్ శాపంగా మారిందని అన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ డ్యామును పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ప్రాథమిక దశలో చర్యలు తీసుకోకపోతే రైతులు చాలా ఇబ్బందులు పడతారని అన్నారు. ఒరిస్సాగు ప్రశ్నార్థంగా మారుతుందని చేశారు. ఈ కార్యక్రమంలో మండపూడి చంద్రశేఖర్, కంచర్ల కొండయ్య, మల్లికార్జున రావు, యాదగిరి, గూటి నాగయ్య పాల్గొన్నారు.

బస్సు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - మైలవరం :

ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో భార్యాభర్తలకు గాయాలైన సంఘటన గణపవరంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి చెందిన నల్లమోతు దానియేలు, అతని భార్య మైలవరంలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఈదర వెళుతుండగా విజయవాడ నుండి విస్సన్నపేట వెళ్తున్న బస్సు గణపవరం చెరువు దాటిన తర్వాత మలుపు వద్ద ఢీకొనడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడులకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన దాడుల నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను పోలిస్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వత్సవాయిలో పార్టీ కార్యాలయంపై కూటమి సభ్యులు దాడి చేసి జెండా దిమ్మెను ధ్వంసం చేసి, టివి, ఫర్నిచర్, విలువైన వస్తువులను పగలగొట్టారని పేర్కొ న్నారు. పోలంపల్లి గ్రామ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దివంగత కాటేపల్లి రామయ్య విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో పాటు, కోటి రూపాయల వ్యయంతో రాష్ట్ర సరిహద్దు వద్ద నిర్మించిన రోడ్డు శిలాఫలకాన్ని, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను టిడిపి మూకలు ధ్వంసం చేశాయన్నారు. అనిగండ్లపాడు గ్రామ సర్పంచ్ జ్యోతి బ్రహ్మం ఇంటిపై టిడిపి నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. పలు గ్రామాల్లోని వైసిపి కార్యకర్తల ఇళ్లపై దాడులు చేశారని విమర్శిం చారు. ఇళ్లల్లో విలువైన వస్తువులు ధ్వంసం చేశారని, రాళ్ల దాడులకు కూడా తెగ బడ్డారని మండిపడ్డారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకో వాలని ఉదయభాను వినతిపత్రం ద్వారా కోరారు.



పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న సామినేని

వన్‌టౌన్ : ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల తర్వాత జరుగుతున్న రాజకీయ దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని బుధవారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రామకృష్ణకి మాజీ మంత్రి, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ నగర అధ్యక్షులు మల్లాది విష్ణు, నగర మేయర్ భాగ్యలక్ష్మి, నందిగామ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, షేక్ ఆసిఫ్, స్వామి దాసు, కైలే అనిల్ కుమార్, తిరుపతిరావు, పోతిన వెంకట మహేష్, పలువురు న్యాయవాదులు వినతి పత్రం అందజేశారు.



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వైసిపి నాయకుడిపై దాడికి నిరసన

ప్రజాశక్తి- భవానీపురం : వైసిపి నాయకుడు మైలవరపు దుర్గారావుపై జనసేన నాయకుల దాడిని నిరసిస్తూ బుధవారం 44వ డివిజన్ చెరువు సెంటర్ వద్ద వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. చెరువుసెంటర్‌లో వైసీపీ శిలాఫలకం ధ్వంసం చేస్తున్నవారిని అడ్డుకునేందుకు వెళ్లిన 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి భర్త దుర్గారావుపై ఈనెల 2వ తేదీన దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ నేపథ్యంలో దుర్గారావును మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు షేక్ ఆసిఫ్, పోతిన మహేష్ తదితరులు ఆస్పత్రిలో పరామర్శించి దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు చెరువు సెంటర్‌లో పికెట్‌ను ఏర్పాటు చేశారు.



విరాళం అందచేస్తున్న గిరి

విరాళం

ప్రజాశక్తి - విసన్నపేట : విస్సన్నపేట మండలం స్థానిక ఎ.కొండూరు రోడ్డులోని ఎన్ఎస్పి కాలువ పక్కన స్వామి అయ్యప్ప మండల పూజా పీఠంను సందర్శించిన వల్లభనేని గిరి (ఎన్ఆర్ఐ) పీఠం అభివృద్ధి కోసం మూడు లక్షల రూపాయలు విరాళం ఇచ్చారు. అనంతరం పీఠం తరుపున గురువు ఓలేటి దుర్గారావు శాలువాతో వల్లభనేని గిరి (ఎన్ఆర్ఐ)ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో లకుం పవన్, యలమ గోపాలరావు (గురువు), రాయల సుబ్బారావు, ముత్తంశెట్టి వంశీ, బెల్లంకొండ రాజా, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని అగ్రహారం, ముక్త్యాల, జయంతిపురం, రావిరాల, వేదాద్రి, బండిపాలెం, పోచంపల్లి వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి యుటిఎఫ్ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుండే సంఘమని, 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు యుటిఎఫ్ సంఘం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ఎస్ఎన్ మూర్తి, అల్లిక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఉపాధి పనులు చేసిన కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏఓ నాగమహేశ్వరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి. పవన్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి కార్మికులు గత రెండు నెలలుగా ఎండలో ఎండి పనిచేస్తే సుమారు ఎనిమిది వారాల బిల్లులు బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు గత ఆరు మాసాలుగా అటు వ్యవసాయ పనులు లేక ఇటు చేసిన ఉపాధి పనులకు కూలి రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం కలుగజేసుకొని ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పారా, పలుగు తట్ట మెయింటెనెన్స్ కు, సమ్మర్ అలవెన్స్ డబ్బులు వేయాలని, మజ్జిగ ,మంచినీరు కూలీలకు సరఫరా చేయాలని మెడికల్ కిట్ లు ఇవ్వాలని, టెంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, ప్రస్తుతం కొనసాగుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ ఒత్తిడి కారణంగా తొలగించరాదని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏఓ నాగమహేశ్వరావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి బకాయిలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం : ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం బాపులపాడు మండల నాయకులు బర్రె లెనిన్ డిమాండ్ చేశారు. బుధవారం బాపులపాడు మండలం బండారు గూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ బకాయిలను వెంటనే చెల్లించాలని మహిళలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఉపాధి పనులు చేసిన కూలీలకు సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనం రావడం లేదన్నారు. పనిచేసే చోట సరైన వసతులు కల్పించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉపాధి బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ కార్మికులు కుమారి, బర్రె విజయమ్మ, మేరీ పాల్గొన్నారు.

నేడు రక్తదానం శిబిరం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరులోని శ్రీ దాన శక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు దివిసీమ ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ కోడూరు మండల అధ్యక్షులు పూతబోయిన సీతారత్న సాయిబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు వెంకట్రామ్, శ్రీలం అశ్విన్ పాల్గొంటారని తెలిపారు.

కౌలు రైతులను ఆదుకోవాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చల్లపల్లి(మొవ్వ) : గతంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతు చట్టాన్ని రద్దుచేసి 2011 భూ రైతుల చట్టాన్ని అమలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొవ్వ మండలం, బట్ల పెనుమర్రు లో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. భూ యజమానుల సంతకం తో సంబంధం లేకుండా, గ్రామ రెవెన్యూ అధికారులు కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు పంట రుణాలు, పంట బీమా, రైతు భరోసా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో కౌలు రైతులు ఐ. వెంకటేశ్వరరావు ఏ ,గురవయ్య, మొవ్వ నాగేంద్ర,కోటేశ్వరావు పలువురు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



కౌలు రైతుల నుంచి సంతకాలు సేకరిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

'ఉషారామ'లో ప్లాస్టిక్ బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు : భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించే దానికి అందరూ కృషి చేయాలని ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివికె ఎస్వి ప్రసాద్ అన్నారు. బుధవారం మండలం లోని తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థిని, విద్యార్థులు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా క్లాత్ బ్యాగ్స్ ను కళాశాల లోని రెండు వేల మంది విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ఉందని దానిని నిలువరించే దానికి కళాశాలలోని ఎన్ ఎస్ ఎస్ విద్యార్థిని, విద్యార్థులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం అన్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని మరిన్ని విద్యాసంస్థలు, విద్యార్థిని, విద్యార్థులు ,యువకులు ముందుకు రావాలని తద్వారా ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యం అవుతుంది అని అన్నారు. ఈ ప్రయత్నం వల్ల పర్యావరణానికి మేలు చేసిన వారవుతారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వై వరప్రసాద్ (ఐటీ – హెచ్ఓడి) ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి శ్రీహరి బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ బ్యాగులు అందిస్తున్న దృశ్యం

పంట ఉత్పత్తుల పురోభివృద్ధికి తోడ్పడాలి : జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పంట ఉత్పత్తి ,రైతు సంఘాలకు అన్ని విధాల ప్రోత్సాహం అందించి వాటి పురోభివృద్ధికి తోడ్పడాలని జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం సంయుక్త కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో నాబార్డ్ కేంద్ర రంగ పథకం అవగాహనపై వ్యవసాయ అనుబంధ శాఖలు, నాబార్డు అధికారులు, రైతులతో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ పంట ఉత్పత్తి రైతు సంఘాలకు (ఎఫ్‌పి ఓలు) కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా అనేక ప్రయోజనాలు అందిస్తోం దన్నారు. పంట ఉత్పత్తి రైతు సంఘాలకు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిం చేందు కోసం నాబార్డు 5 సంవత్సరాలలో 43 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తోం దన్నారు. జిల్లాలో ప్రస్తుతం 25 బ్లాక్ లకు గాను 22 బ్లాక్ లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు పండించే రైతులతో పంట ఉత్పత్తి రైతు సంఘాలు ఏర్పాటు అయ్యాయన్నారు. మిగిలిన కత్తివెన్ను, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో కూడా పంట ఉత్పత్తుల రైతు సంఘాల ఏర్పాటుకు కషి చేయాలన్నారు. పంట ఉత్పత్తి రైతుసంఘాలకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, మండి తదితర లైసెన్సులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందుటకు సానుకూలంగా వ్యవహరించాలన్నారు. పంట ఉత్పత్తి రైతు సంఘాల ఆర్థిక పురోభివద్ధికి అందరూ కలిసికట్టుగా కషి చేయాలన్నారు. పంట ఉత్పత్తి రైతు సంఘాల వలన రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా వినియోగదారులకు కూడా నాణ్యత గల పంట ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించి లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాబార్డ్ డీడీఎం మిలింద్ చౌశాల్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, వ్యవసాయ శాఖ డిడి మనోహర్,ఎడి మణిధర్, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి జే జ్యోతి, ఏపీఎంఐపీ అధికారి విజయలక్ష్మి, డిసిఓ చంద్రశేఖర్ రెడ్డి, జి ఎస్ టి ఓ పరుశురాము, ఎల్ డి ఎం జయవర్ధన్, పలువురు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి గీతాంజలి శర్మ



కోటేశ్వరరావుకు ఘన నివాళి

పామర్రు: సిపిఎం సీనియర్ నాయకులు బరిగెల కోటేశ్వరరావు 20వ వర్ధంతి స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదట బరిగెల కోటేశ్వరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పామర్రు సిపిఎం కన్వీనర్ ఓ గంగాధర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభకు సిపిఎం జిల్లా నాయకులు ఆర్ సి పిరెడ్డి హాజరై మాట్లాడారు. నేడు దేశంలో పెరిగిన అరాచక శక్తులను ఎదుర్కోవాలంటే ఉద్యమాలు పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఆనాడు సుందరయ్య స్ఫూర్తితో పామర్రు మండల పరిసరాల ప్రాంతాల్లో ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు సిపిఎం నాయకులు, కోటేశ్వరరావు కుమారుడు భీమేశ్వరరావు, ముళ్ళపూడి విల్సన్, కాటూరి నాగభూషణం, చాట్ల రాంబాబు, రామస్వామి, లక్ష్మణ రావు, చిన్న ఏడుకొండలు. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నూతన బిల్డింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : ప్రతి విద్యార్థి డిగ్రీ పట్టాతో ఉద్యోగం తీసుకెళ్ళాలనేది ఆదిత్య లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ గౌరి శంకరపురంలో ఆదిత్య డిగ్రీ కళాశాల నూతన బిల్డింగ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం టిటిడి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆదిత్య కళాశాలలో మంచి కోర్సులను అందించడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ మాజీ ఎంఎల్ఎ, ఎంఎల్సి ఎన్ శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్ సుగుణారెడ్డి, మాజీ ఎంఎల్ఎ రావి వెంకటేశ్వరరావు, విశ్వభారతి విద్యాసంస్థల అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, శ్రీవిద్య కరెస్పాండెంట్ ఎస్ రాంబాబు, ఆదిత్య కళాశాల డైరెక్టర్ బిఇవిఎల్ నాయుడు, ప్రిన్సిపల్ చిట్టూరి రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఉయ్యూరు : నీట్ నెట్ పరీక్ష పేపర్ లీకేజీను నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ గురువారం దేశంలో గల విద్యాసంస్థలన్నీ ఎల్కేజీ టూ పీజీ బందుకు పిలుపునిచ్చిందని ఎస్ఎఫ్ఐ కృష్ణ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ ఉపాధ్యక్షుడు సలీం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ గౌరవ ప్రతిష్టలకు విశిష్టమైన నీట్ పరీక్ష దేశ చరిత్రలో ఏనాడు కనివిని ఎరగని రీతిలో ఈ సంవత్సరం అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నూతన విద్యా విధానం పేరిట దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేత ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు బందుకు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వినోద్, నివాస్, శ్రావణి పూజిత తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అతిసారపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ కె.పుష్పలత, కొండపల్లి మున్సిపాలిటీ కమిషనర్ నాయక్ ఆదేశాల మేరకు కొండపల్లి రాజీవ్ నగర్ పరిధిలోని అంగన్వాడీ కేంద్ర పరిధిలోని తల్లులకు కొండపల్లి 3 సచివాలయంలో స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ జి.రమాదేవి కుటుంబంలో ఎవరైనా డయేరియా బారిన పడినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. జింక్ టాబ్లెట్ వాడకం, ఒఆర్ఎస్ ద్రావణం తయారు చేసే విధానం డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల సూపర్వైజర్ జి.రమాదేవి ఎఎన్ఎం రత్న కుమారి అంగన్వాడీ కార్యకర్త పి.సబితా అంగన్వాడీ హెల్పర్ బి.భవాని, సచివాలయం విఆర్ఒ బసవరాజు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ అరలయ్య, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కేంద్ర పరిధిలోని తల్లులు పాల్గొన్నారు.



పాఠశాల మైదానం అభివృద్ధి

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక ఎంపిపి పాఠశాల ఆవరణ పునరుద్ధరణ పనులు బుధవారం నిర్వహించారు. ఎంఇఒ నరసింహారావు, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుల చొరవతో ఈ పనులు నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆవరణ బురదమయంగా ఉండి విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు పడుతుండటంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నంశెట్టి మోహన్‌రావు తన సొంత ఖర్చుతో పది ట్రక్కులు మట్టి పోయించారు. డోజర్‌తో సరిచేయించి పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలవకుండా కచ్చాడ్రైన్ ఏర్పాటు చేశారు. ఈ పనులకు అధికార పార్టీ నాయకులు రేగళ్ల వీరారెడ్డి సహకరించినట్లు హెచ్‌ఎం మోహన్‌రావు తెలిపారు.

ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - మైలవరం : పది సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వృద్ధులు, అనాథలు, వికలాంగులు, కిడ్నీ, క్యాన్సర్, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రతినెల అవసరమైన మందులు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా మదర్ థెరిసా ట్రస్టు ద్వారా లబ్ధి పొందుతున్న వారిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదివేందుకు ఆటంకం కలిగిన విద్యార్థులకు ఫీజులు చెల్లించి వారు మంచి ప్రయోజకులయ్యే విధంగా సహకారం అందజేశామన్నారు. ప్రతిఒక్కరూ తమకు ఉన్నదాంట్లో పేదలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.



లబ్ధిదారులను కలిసిన ట్రస్ట్ నిర్వాహకులు

చట్ట సవరణ కోరుతూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - వీరులపాడు : సిసిఆర్‌సి చట్ట సవరణ కోరుతూ ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. మండల కమిటీ ఆధ్వర్యంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కోడూరు పిచ్చేశ్వరరావు సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా నేరుగా భూమి సాగుచేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2011 భూ ఆధీకృత కౌలు రైతు చట్టంలో మార్పు చేసి భూమి యజమాని అనుమతి తప్పనిసరి చేయడంతో అనేకమంది కౌలు రైతులు కౌలు కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొని వ్యవసాయ సాగు చేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కౌలు రైతుల రక్షణ కోసం 2011లో ఏర్పాటు చేయబడిన భూ ఆధీకృత చట్టం ద్వారా భూమి యజమానితో



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, బ్యాంకులు ద్వారా ఋణాలు మంజూరు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేసేందుకు రైతులతో సంతకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం వీరులపాడు మండల కార్యదర్శి చాట్ల రవి, ప్రభాకర్, పుల్లయ్య, వెంకటేశ్వరరావు తదితర కౌలు రైతులు పాల్గొన్నారు.

అతిసారను అరికట్టాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అతిసారపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ హాస్పటల్‌లో డయేరియా రోగులను బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ సుహాసినీని డయేరియా పరిస్థితిపై కలిశారు. సుహాసిని మాట్లాడుతూ డయేరియా ప్రస్తుతం అదుపులోనే ఉందని, కేసులు చాలా వరకు తగ్గాయని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మరగబెట్టి చల్లార్చిన నీటిని తాగాలని, భోజనానికి ముందు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డయేరియా బాధితులను వాంతులు, విరోచనాలు రావడానికి గల కారణాలు, పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ 15 రోజులుగా జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా వల్ల బాధితులు బాగా ఇబ్బందులకు గురవుతున్నారు. క్లోరిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని ఇండ్లకు



డిఎంహెచ్‌ఒతో కలిసి రోగులను పరామర్శిస్తున్న సిపిఎం బృందం

పంపిణీ చేయడంతో పాటు వాటిని వాడే విధానాన్ని ప్రజలకు తెలపాలన్నారు. అనంతరం జగ్గయ్యపేట తహశీల్దార్ శేషగిరిరావుకు సిపిఎం నాయకులు డయేరియాను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా కృష్ణ, కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌసమియా, ఎస్.రామనాథం, బాలు, వీవి రాంప్రసాద్, రావెళ్ళ శేషు, బూచమ్మ తదితరులు పాల్గొన్నారు.

అతిసార తగ్గు ముఖం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మంగళవారం షేర్ మహ్మద్ పేట, చిల్లకల్లు, మక్కపేటల్లో గల వైద్య శిబిరాలను ఆమె సందర్శించారు. మొత్తం నాలుగు కేసులకు జగ్గయ్యపేటలో చికిత్స నిర్వహిస్తున్నామని తెలిపారు. చికిత్సలో ఉన్నవారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. వైద్యాధికారులు జగ్గయ్యపేట చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించారన్నారు. ఆ క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని తక్కెళ్ళపాడు సచివాలయం పరిధిలోని రామచంద్రుని పేటను సందర్శించి అక్కడ బూడిదతో ఇటుకలు తయారీ కేంద్రంలోని వారి ఆరోగ్య పరిస్థితులు ఆరా తీశారు. జగ్గయ్యపేట పి.పి యూనిట్‌లో మిట్టగూడెం కోల్లా కాంప్లెక్స్‌లో వైద్యాధికారులకు, ప్రోగ్రాం అధికారులకు, పర్యవేక్షకులకు, ఎ.ఎన్.ఎమ్‌లకు ఆశా కార్యకర్తలకు తీసుకోవలసిన విధి విధానాలు, చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో నివారణా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఇందుమతి, ఎన్.హెచ్.ఏమ్, డిపిఎంఒ డాక్టర్ నవీన్, డా.బాలజీ, డా.విద్యసాగర్, డా.సునీల్, డా.పవన్, తదితర వైద్యులు, ఏ.ఏన్.ఏమ్‌లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అందించే మంచినీటి ట్యాపులు, వాటర్ ట్యాంకులను మండల సిపిఎం బృందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ అవుట్ గేట్ ముందు ఆర్టీసీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సిపిఎం నాయకులు బైటాయించి ధర్నాకు దిగారు. మౌలిక వసతులు కల్పించాలని, ప్రయాణికులకు శుద్ధమైన మంచినీరు అందించాలని, వాటర్ ట్యాంక్, వాటర్ ట్యాప్ లను మార్చాలని, మరుగుదొడ్డి వాడకంపై ప్రయాణికుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని, వెంటనే ఆర్టీసీ డిపో మేనేజర్ రావాలని కోరుతూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ రఘురాం తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలం వద్దకు వచ్చారు. నాయకులతో చర్చించి త్వరలో బస్టాండ్‌లో వాటర్ ట్యాపులు, వాటర్ ట్యాంక్‌ను మారుస్తానని మౌలిక వస్తువులు కల్పించడంతోపాటు మరుగుదొడ్ల వాడకంపై ప్రభుత్వం నిర్దేశించిన ఐదు రూపాయలు తీసుకునేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు మాట్లాడుతూ బస్టాండ్‌లో అపరిశుభ్రంగా కలుషితమైన నీటిని అందిస్తూ ప్రజల ప్రాణాలతో ఆర్టీసీ వారు చలగాటమాడుతున్నారని



బస్టాండ్ ఆవరణను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తక్షణమే ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక వస్తువులు కల్పించాలన్నారు అనంతరం మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ డిపో మేనేజర్ రఘురాంకు పార్టీ నాయకులు వినతి పత్రం అందజేసి ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్ మియా, బాలు, వివి రాంప్రసాద్, రావెళ్ళ శేషు, భూషమ్మ, ఎస్ రామనాథం తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న రేణుక

పూడిక తీత

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని ఊటుకూరు గ్రామంలో దీర్ఘకాలికంగా పూడుకుపోయిన డ్రెయిన్లను పరిశుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ గ్రామ సర్పంచ్ బొల్లె పోగు రేణుక తెలిపారు. ఈ మేరకు బుధవారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.



ఎపిపిటిడి కార్మిక పరిషత్‌లో చేరిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : స్థానిక ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయు, ఎంప్లాయిస్ యూనియన్‌లకు చెందిన 100 మంది కార్మికులు మంగళవారం ఎపిపిటిడి కార్మిక పరిషత్‌లో చేరారు. కార్మిక పరిషత్ యూనియన్ ప్రెసిడెంట్‌గా బి.కృష్ణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.రావు, సెక్రటరీగా ఎస్.కె.దాదా సాహెబ్, జాయింట్ సెక్రటరీగా పి.వి.రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.హెచ్.నాయక్, అసిస్టెంట్ సెక్రటరీగా ఎం.లలితా బాయి, ట్రెజరర్‌గా కె.శంకరరావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఆర్.ఎస్.రావు, కమిటీ సభ్యులుగా వి.ఎస్.ఎస్.రావు, ఎస్.కె.ఎం. సాహెబ్, కె.నవీన్, ఎం.రమేష్, వి.ఆర్.సిహెచ్. రావు ఎన్నికయ్యారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో పాలేటి ఒడ్డున గల శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం (మఠం శివాలయం) పునర్నిర్మాణానికి (పంచాయతన క్షేత్రం) తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణానికి చెందిన ప్రముఖులు నారపరాజు శ్రీనివాసరావు, అనురాధ దంపతులు, వారి కుమారుడు యశ్వంత్ ఆలయ పున:నిర్మాణానికి 11 వేల 300 రూపాయలు విరాళాన్ని మఠం శివాలయం ప్రైవేట్ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్‌కు చెందిన పాచిమంచి చంద్రశేఖర్ రంగరాజు వాసుదేవ రావు, భువన గిరి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

నాలుగు అతిసార కేసులు నమోదు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : డయేరియాతో జగ్గయ్యపేట ప్రాంతంలో కొత్తగా 4 కేసులు నమోదయ్యాయి. వీటిలో పెనుగంచిప్రోలుకు చెందిన ఓ కరుణాకర్, జగ్గయ్యపేట మండలం పోచంపల్లికి చెందిన జి.బాలస్వామి, చిల్లకల్లుకు చెందిన చింతలపాటి వెంకటలక్ష్మి, జగ్గయ్యపేట డాంగే నగర్‌కు చెందిన భక్తుల శివమ్మ బుధవారం డయేరియా బారిన పడ్డారు. ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్‌లో డయేరియాతో చికిత్స పొందుతున్న డయేరియా వ్యాధిగ్రస్తులు ఏడుగురున్నారు. బాధితులను డిఎంహెచ్‌ఒ సుహాసిని పరామర్శించారు.



విద్యార్థులకు నోటుపుస బికాలు పంపిణీచేస్తున్న భానుప్రతాప్

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తోచిన విదంగా సాయం చేయడం అభినందనీయ మని కడవకొల్లు సర్పంచ్ సుధారాణి అన్నారు. ఉయ్యూరుకు చెందిన బూరగడ్డ భాను ప్రతాప్ ఆధ్వర్యంలో మండలపరిషత్ ప్రాధమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.20 వేలు విలువచేసే నోటుపుస్తకాలు బుదవారం పంపిణీచేశారు. ఎంఈవో1 పద్మారాణి, ఎ ంఈవో 2 సుధారాణి, ఎస్ఎంసీ చైర్మన్ ప్రియాంక, పాఠశాల హెచ్ఎం శ్రీధర్ రెడ్డి భాను ప్రతాప్ ను అభినందించారు.

బుద్ధప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనగడ్డ శాసనసభ్యులుగా నాలుగవసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన శుభ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్‌ను హైదరాబాదులో ఘనంగా సత్కరించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం నిర్వాహకులు తెలిపారు. బుధవారం సాయంత్రం లకిడికపూల్ హెూటల్ సెంట్రల్ కోర్టు ప్రాంగణంలో సంగమం ఫౌండేషన్ ఎస్ ఇ డబ్ల్యు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుద్ధ ప్రసాద్కు ఆత్మీయ అభినందన సభ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ ప్రముఖ సినీ నటుడు మాగంటి మురళీమోహన్, ప్రముఖ రచయిత సినీ నటుడు తనికెళ్ల భరణి ముఖ్య అతిథులుగా విచ్చేసి బుద్ధ ప్రసాదును ఘనంగా సత్కరించినట్లు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి : అనాధ వద్ధులకు సహా యం చేయటం ఆదర్శనీయమని చల్లపల్లి ఎస్ఐ సీహెచ్ చినబాబు అన్నారు. బుధవారం చల్లపల్లి నిమ్మలతోటలోని సీయోను వద్ధాశ్రమంలో గ్రామ ప్రముఖులు, జనసేన పార్టీ నాయకులు అడపా అద్దంకి నాంచారయ్య - కష్ణకుమారి దంపతులు తమ కుమార్తె వాగ్దేవి పుట్టినరోజు సందర్భంగా 30 మందికి అన్నదానం చేసి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎస్ఐ చినబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, పార్టీ నాయకులు అడపా రవి, అడపా లీలా ప్రసాద్, అడపా బాబూరావు, ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - గుడివాడ : ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివద్ధి సాధ్యమవు తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం స్టాఫ్ డయేరియాపై ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వైద్యులతో ఎమ్మెల్యే రాము సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఇందిరాదేవి డయేరియా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే రాముకు వివరించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశ రాష్ట్ర అభివద్ధి సాధ్యం, అందువల్ల ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తమ ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం సీజన్ ముందు కాలువలలో కొత్తనీరు చెత్తాచెదారం కొట్టుకు వచ్చి నీటి కాలుష్యంతో డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్తగా ప్రభుత్వం డయేరియా నివారణకు, తగిన అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రతిష్టాత్మకంగా స్టాప్ డయేరియా ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

వెనిగండ్లకు కౌలు రైతు సంఘం నాయకుల వినతి : కౌలు రైతు గుర్తింపు కార్డుకు యజమాని సంతకం నిబంధన ఎత్తి వేయాలని కోరుతూ గుడివాడ ఎంఎల్ఎ వెనిగండ్ల రాముకి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగరావు, గుడివాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంట అక్కయ్య, లేళ్ల రాంబాబు, నాయకులు బివి శ్రీనివాసరావులు బుధవారం స్థానికి టిడిపి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్తామన్నారు.

చెట్టు నరికివేతపై ఫిర్యాదు



చెట్టును కొట్టేసిన దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ శివారు బందులాయ చెరువు గ్రామానికి చెందిన సింహాద్రి భాగ్యలక్ష్మి స్థలంలో ఉన్న భారీ వక్షాన్ని కొందరు బుధవారం తెల్లవారుజామున నరికి వేసినట్లు అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేసింది. బుధవారం ఎస్సై జి రమేష్ బాబుని కలిసి చెట్టు ఉన్న స్థలం కోర్టు కేసులో ఉన్నదని, అయితే ఆ ప్రాంతానికి చెందిన కొందరు తెల్లవారుజామున తమ స్థలంలోకి ప్రవేశించి చెట్టును రంపతో కోసి పడగొట్టారని భాగ్యలక్ష్మి ఆరోపించింది. ఆ స్థలం తమదని దానికోసం కోర్టులో కేసు వేయడం కూడా జరిగిందన్నారు. కోర్టు కేసు దావాను తప్పుదారి పట్టించేందుకే ఈ చర్యకు పూనుకున్నారని, అందువల్ల ఈ చర్యకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేసింది.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో దేవాలయ అధికారిణి

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కష్ణాజిల్లా దేవాదాయ శాఖ అధికారిణి సంధ్య బుధవారం దర్శించుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించుచున్న సందర్భంగా ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, ఆలయ పండితులు, అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామిని దర్శించుకునగా, ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందరభంగా




సంధ్యని ఆలయ సూపర్డెంట్ బొప్పాన సత్యనారాయణ, కష్ణాజిల్లా దేవాదాయ శాఖ తనిఖీ అధికారి కె. శ్రీనివాసరావు ,ఆలయ సిబ్బంది, వేద పండితులు సత్కరించి ప్రసాదాలను అందించారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్ డే దినోత్సవం

ప్రజాశక్తి-చల్లపల్లి : వత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని మోటర్ మెకానికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నబి ఘోరి అన్నారు. చల్లపల్లి టూ వీలర్స్ మెకానికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మెకానిక్ డే కార్యక్రమాన్ని ఘనంగా బుధవారం స్థానిక రిజిస్టర్ కార్యాలయం సమీపంలో చందు మెకానిక్ షెడ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హీరో షోరూం అధినేత శ్రీనివాస్, ఆటోనగర్ యూనియన్ ప్రెసిడెంట్ అన్వర్ భాష పా పాల్గొన్నారు. చల్లపల్లి యూనియన్ ప్రెసిడెంట్ కొల్లూరి ప్రేమ్చంద్ వైస్ ప్రెసిడెంట్ జంపాన దాసు, సెక్రటరీ తుమ్మల చంద్రశేఖర్ ,హాఫీజ్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ యునుస్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : బైక్ మెకానిక్ లను ప్రభుత్వం తగని రీతిన ఆదుకోవాలని సీనియర్ మెకానిక్ మహమ్మద్ అల్తాఫ్ కోరారు. బుధవారం ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవం సందర్భంగా గన్నవరంలో బైక్ మెకానిక్ లు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అన్ని రహదారులపై ర్యాలీ నిర్వహించి, బైక్ మెకానిక్ ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు రవి, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి కన్నా తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : బంటుమిల్లి గ్రామంలో మెకానిక్స్ డే సందర్భంగా యువ గణేష్ మోటర్ సైకిల్ మెకానికల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. కూనపురెడ్డి వీరబాబు, బొర్రా కాశి, రేవు గోపాలకష్ణ, యూనియన్ మెకానిక్ ప్రెసిడెంట్ బాజీ, బుజ్జి, గంగ నాగరాజు పాల్గొన్నారు.



గన్నవరంలో...



బంటుమిల్లిలో ఎంఎల్‌కు కాగితను సన్మానిస్తున్న దృశ్యం

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో మార్పు

ప్రజాశక్తి, గుడివాడరూరల్: విద్యుత్ వినియోగ దారులు తమ నెలవారి బిల్లులను ఎపీసీపీడీసీఎల్ కజ్యూమర్ యాప్‌లో, సంస్థ వెబ్‌సైట్‌లో మాత్రమే చెల్లించాలని గుడివాడ పట్టణ డీ2 ఏఈ భాను ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపిఐ యాప్స్ నందు విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఎపీసీపీడీసీఎల్ డిస్కామ్ పేరు కనిపించ దన్నారు. స్మార్ట్ ఫోన్‌లో ఎపీసీపీడిసీఎల్ కజ్యూమర్ యాప్‌ని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చున్నారు. యూపీఐ యాప్స్‌లో నేరుగా చెల్లించటం కుదరదని లేదా ఎపీసీపీడీసీఎల్ డిస్కామ్ వెబ్‌సైట్ నుంచి గాని బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించారు. డిబిట్ కార్డు, క్రెడిట్‌కార్డు, క్యాష్ కార్డు, వాలెట్స్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చుని సూచించారు. సకాలంలో విద్యత్ బిల్లులు చెల్లించి అపరాధ రుసుమును నుండి మినహాయింపు పొందాలని ఆయన సూచించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సీఐ త్రినాథ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో గ్రీన్ ఇండియా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ పి త్రినాథ్ ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపర్డెంట్ జయ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం జీవకోటి జీవన ప్రమాణాలను పెంచేందుకు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆదాల రమేష్ బాబు, కోఆర్డినేటర్ అశోక్ డీన్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్రపటాలు అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామ సచివాలయం లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చిత్రపటాలను శ్రీకాకుళం గ్రామ ఉపసర్పంచ్ శీలం శ్రీనివాసరావు బుధవారం కార్యదర్శి జి శ్రీనివాస్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం గ్రామ సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎన్డీఏ కూటమి నాయకులు సుగ్గన పవన్ కుమార్, కోడి శ్రీను, రోళ్ల సుధాకర్, సుధీర్, సురేష్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరలో ప్రారంభం : ఎంపి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గత ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెండింగ్ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని ఎంపీ బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీలోని గహ నిర్మాణ, పట్టణాభి వద్ధి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాది కారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మచిలీపట్నం నగరంలో చేపట్ట బోవు పనులను గురించి వాటి పురోగతి గురించి ఉన్నతాధి కారులు ఎంపీకి వివరించారు. 2023 నుండి ఎటువంటి సరైన కారణాలు లేకుండానే కొన్ని ప్రాజెక్టు పనులు ఆగి పోయాయని వివరించారు. సదరు అధికారుల వివరణలు విన్న ఎంపీ ఇకనైనా త్వరిత గతిన ఆగిపోయిన పనులను ప్రారంభించాలని , ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని, సంబంధిత మున్సిపల్ కమీషనర్ కూడా ఈ విషయమై తగిన సహకారం అందచేస్తామని తెలిపారని కాబట్టి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ నుండి అధికారుల బందం మచిలీపట్నం వచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేస్తామని అధికారులు ఎంపీ కి వివరించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సౌమ్య

చందాపురం ఎంపిపి పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలని నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఉపాధ్యాయులకు సూచించారు. నందిగామ మండలం చందాపురం ఎంపిపిఎస్ పాఠశాలను సౌమ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు తరగతులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదవాలని సూచించారు. అన్ని తరగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల వాతావరణం పరిశీలించారు. కొందరు ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు పుస్తకాలు అందినవా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం పూట విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయం మెనూ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఉన్నారు.


నిరసన తెలుపుతున్న బస్సుల యజమానులు

హయ్యర్ బస్సుల యజమానుల నిరసన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : తమకు ఎ లాంటి సమాచారం లేకుండా టైమింగ్స్ మార్చారని హయ్యర్ బస్సుల యజమానులు బుధవారం స్థానిక బస్టాండ్‌వద్ద నిరసనకు దిగారు. జగ్గయ్యపేట బస్ డిపో పరిధిలో 37 హయ్యర్‌బస్‌లుండగా ప్రస్తుతం 3 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. అగ్రిమెంట్లు పూర్తయిపోవడంతో బస్సుల సమయాన్ని మార్చి 3 బస్సులకు మాత్రమే రెగ్యులర్‌తో అనుమతి ఇవ్వడంతో మిగిలిన బస్సుల యజమానులు ఆందోళనకు దిగారు. దీంతో డిపో మేనేజర్ రఘురాం బస్టాండ్ వద్దకు వచ్చి వారితో చర్చించి త్వరలో కార్యచరణ చేపడతామని హామీ ఇచ్చారు. స్థానిక ఎంఎల్‌ఎ శ్రీరామ్ రాజగోపాల్ ఫోన్‌లో ఆర్‌ఎంతో మాట్లాడారు. సమస్య పరిష్కారమయ్యేలా చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

గరికపాడు కెవికె సందర్శన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

మండలంలోని గరికపాడు డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రంను బుధవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్. బి.ప్రమీల రాణి, ఉపవిస్తరణ సంచాలకులు డాక్టర్.బి.ముకుందరావు సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కె.వి.కెలోని అన్ని ప్రదర్శన క్షేత్రాలు, భూసార పరీక్షల కేంద్రం, విత్తనోత్పత్తి వీక్షించారు. అనంతరం కె.వికెలోని శాస్త్రవేత్తలతో సమీక్ష నిర్వహించి వారికి తగిన సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం సేవలను మరింతగా రైతులకు చేరువలోకి తీసుకువెళ్లాలని సూచించారు.



స్కేటింగ్‌లో కెబిఎన్ విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి సిహెచ్.రత్నరాజ్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని పొందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ ఇటీవల కాకినాడలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాలను సాధించాడని ఆయన పేర్కొన్నారు. వరుసగా 2వేలు, 3వేలు, ఐదు వేల మీటర్ల స్కేటింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థిని, అతనిని ప్రోత్సహించిన కళాశాల క్రీడా విభాధిపతి డి.హేమచంద్రరావును కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్



ఎం.వెంకటేశ్వరరావు, పిఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ ఇతర అధ్యాపకులు అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు.

గాంధీ బ్యాంక్ ఛైర్మన్ వివక్ష : డైరెక్టర్ కళ్లే

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గాంధీ కో– ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ వేమూరు వెంకట్రావు (చిన్ని) తన పట్ల పూర్తిగా వివక్షత వ్యవహరిస్తున్నారని డైరెక్టర్ కళ్ళే నాగేశ్వరరావు ఆరోపించారు. తాను టిడిపి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండటమే ఇందుకు కారణం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన చేస్తూ తాను గతంలో టిడిపి నేత బుద్దా వెంకన్న సహకారంతో గాంధీ కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అయితే బ్యాంకు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే అక్కడ జరిగే కొన్ని విషయాలపై సందేహంతో జిల్లా సహకార రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే తనకు కనీస సమాచారం లేకుండానే విచారణ జరిపిన డిఆర్ వాళ్లకి అనుకూలంగా నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. దీనిని తాను తీవ్రంగా వ్యతిరేకించినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు. బ్యాంకులో వివిధ సబ్ కమిటీలకు డైరెక్టర్లకు చోటు కల్పిస్తారని, అయితే అందరికీ అవకాశం ఇచ్చినప్పటికీ తనకు మాత్రం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. అదేమంటే తనను టిడిపి వ్యక్తి అంటున్నారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బ్రాంచ్‌కి రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేకుండానే అద్దెకు తీసుకొని చెల్లించడాన్ని తాను తప్పు పట్టినట్లు ఆయన చెప్పారు. అప్పటినుండి పాలక మండలి సమావేశాలకు తనకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. గతంలో తన తల్లి కళ్ళే సీతారావమ్మ పేరిట బ్యాంకు రుణం తీసుకున్నట్లు, ఆమె మరణం తర్వాత బ్యాంకు అప్పు చెల్లించడంతో



పాటు ఆమె మరణానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు బ్యాంకుకు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఇంటి దస్తావేజులివ్వడం లేదని తెలిపారు. వీటన్నింటినీ ప్రశ్నిస్తున్నాననే కోపంతో మూడు రోజుల కిందట జరిగిన బ్యాంకు సర్వజనసభలో నేరుగా తనను చంపుతానంటూ అధికారి ఒకరు బహిరంగ హెచ్చరికలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఛైర్మన్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని బ్యాంకులో జరుగుతున్న అవకతవకలను సరిదిద్దడంతో పాటు తనకు భద్రత కల్పించాలని ఆయన కోరారు.

కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న దినకర్‌కు సన్మానం

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దిన ఘనత కమిషనర్‌గా పని చేసిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు దక్కుతుందని పలువురు విఎంసి అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం జిల్లాకలెక్టర్‌గా వెళ్తున్న నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను నగరపాలక సంస్థలోని వివిధ శాఖాధిపతులు, సిబ్బంది స్థానికతుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఆయా శాఖాధికారులు, ఉద్యోగులు కమిషనర్‌ను బొకేలు అందజేసి, శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ మహేష్ మాట్లాడుతూ దినకర్ పుండ్కర్ విజయవాడ నగరం అభివృద్ధిలో కానీ, సుందరంగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. నగరంలోనే పెద్ద పార్కుగా ఉన్న రాజీవ్ గాంధీ పార్క్ రేనోవేషన్, ఎక్సెల్ ప్లాంట్‌లోని డంపింగ్‌యార్డు సైట్‌నుఒక ట్రిబుల్ ఆర్‌గా తీర్చిదిద్ది విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేశారన్నారు. పాయకాపురం చెరువు, అంబేద్కర్ పార్క్, కెనాల్ క్లీనింగ్, వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఈట్ స్ట్రీట్, స్పోర్ట్స్ స్టేడియంస్ అభివద్ధి, నగరంలో ఉన్న అందమైన స్ట్రీట్ లైట్లు, గ్రీనరీ, వర్టికల్ గార్డెన్స్, పురుషుల కోసం ప్రత్యేకంగా



పింక్ టాయిలెట్, రివర్ ఫ్రెంట్ పార్క్, ఇలా అనేక అభివృద్ధి పనులు చేయించారన్నారు. విజయవాడ నగరానికి తీసుకొచ్చిన స్వచ్ఛ సర్వేక్షన్ రెండు అవార్డులు, ఒక స్కాచ్ అవార్డ్, క్లైమేట్ స్మార్ట్ సిటీస్ అసెస్మెంట్ ఫ్రేమ్ వర్క్ అవార్డు, గార్బేజ్ ఫ్రీ సిటీ సర్టిఫికెట్ అవార్డు, స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు, ఎయిర్పోర్ట్ కారిడార్ డెవలప్మెంట్, నాలెడ్జ్ సెంటర్లో కంచు విగ్రహం ఏర్పాటు లాంటివి ఎన్నో చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్సు) కె.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, సిఎంఒహెచ్ డాక్టర్ పి.రత్నావళి, డిసి ఆర్.సుజనా తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణ శివారు పీటీ కొత్తూరులో టిడిపి ప్రభుత్వంలో పేదల కోసం నిర్మించిన టీడ్కో ఇళ్లను తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. 80 శాతం నిర్మాణం పూర్తయిన ఈ ఇళ్లు వైసిపి ప్రభుత్వంలో నిరుపయోగంగా మారాయని పలువురు లబ్దిదారులు ఆయన దృష్టి తీసుకొచ్చారు. ఈ భవన నిర్మాణాలు ఆపేయకుండా పూర్తిచేసి ఉంటే లబ్దిదారులకు అద్దె ఇళ్ల నుండి విముక్తి పొంది సొంతింటి కల నెరవేరేదని ఎంఎల్‌ఎ అన్నారు.


ఈ టిడ్కో ఇళ్ల నిర్మాణం గురించి ముఖ్యమంత్రితో మాట్లాడి బాధితులందరికీ న్యాయం చేస్తానని ఎంఎల్‌ఎ పేర్కొన్నారు.

లుబ్రికెంట్ ఉత్పత్తులు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

ప్రముఖ లూబ్రికెంట్ ఆయిల్ బ్రాండ్‌గా వెలుగొందుతున్న వీడోల్ నూతన ఉత్పత్తులను అవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధి ఎం.రాంనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్పత్తులను ప్రజలకు అవగాహన కల్పించేందుకు, క్రికెట్ లెజెండ్ సౌరవ్ గంగూలీని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. తమ బ్రాండ్ ఉనికిని మెరుగుపరచుకోవడానికి, మార్కెట్ స్థానాన్ని పటిష్ట చేయడానికి వీడోల్ ప్రయత్నిస్తున్నందున, ఈ భాగస్వామ్యం అత్యంత కీలకంగా నిలిచిందన్నారు. బ్రాండ్ వీడోల్‌కు 70కి పైగా దేశాల్లోని మార్కెట్లలో దాదాపు శతాబ్దపు మహోన్నత వారసత్వాన్ని కలిగి ఉందన్నారు. అంతర్జాతీయంగా 'ప్రొఫెషనల్స్ ఛాయిస్'గా స్థానం పొందిందని తెలిపారు. వీడోల్ ప్రముఖ లూబ్రికెంట్ బ్రాండ్లో ఒకటిగా నిలవటంతో పాటు, ఈ ఏడాది మార్చి 31 నాటికి కార్యకలాపాల ద్వారా రూ.1931 కోట్ల ఏకీకృత ఆదాయంతో అగ్రభాగాన ఉందని అన్నారు.


కార్యకర్తలను పరామర్శిస్తున్న సౌమ్య

బాధిత కుటుంబాలకు సౌమ్య పరామర్శ

ప్రజాశక్తి - నందిగామ :

పట్టణంలో టిడిపి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శించారు. కోమటి వీరయ్య భార్య ఇటీవల కాలంలో అకాల మరణం చెందిగా వారి స్వగహమునందు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న అన్నం బుచ్చిబాబు, సోలా వెంకటేశ్వరరావు, (వారి సతీమణి) తొర్లికొండ వెంకట్రావు, గన్నవరపు అప్పారావును వారి వారి స్వగృహాల్లో పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, త్వరితగతిన కోలుకుంటారని మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పట్టణ పార్టీ నేతలు పాల్గొన్నారు.

పెన్షన్‌ల పంపిణీలో జగ్గయ్యపేట ముందు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

పెన్షన్ పంపిణీలో జగ్గయ్యపేట మండలం జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందని మండల అభివృద్ధి అధికారి ఎం.రమేష్ తెలిపారు. జగ్గయ్యపేట మండలములో మొత్తం 10373 పెన్షన్‌లను జులై 1-2024 అయిన మొదటి రోజే 93శాతం పంపిణీ చేసి జులై 2న రోజు 99.31 శాతంతో జిల్లాలోనే జగ్గయ్యపేట మండలం మొదటి స్థానంలో ఉందని తెలిపారు.